# అచలపతీ- పాదధూళీ

ఈ కథ మా మాంకాళి (అసలు పేరు మహాకాళి) అత్తయ్య ప్రవేశంతో మొదలు పెడతాను. అసలు అత్తలంటేనే నాకు మంట. అందులో ఈవిడంటే మరీనూ. మా అమ్మా, నాన్న పోయింతర్వాత నా 'పెద్ద దిక్కు' పోస్టు ఈవిడ తనకుతానే తీసుకొంది. అంటే పనిభారం ఎక్కువగా ఉంటుందనుకొనేరు – అడపాదడపా నన్ను తిడుతూండడం అంతే! వస్తూనే డ్యూటీలో దిగిపోయింది.

"ఏరా, బారెడు పొద్దెక్కినా లేవకుండా ఇంకా ఆ నిద్రేమిటీ? రాత్రంతా ఆంబోతులా తిరిగొచ్చుంటావు.. కళ్లు విచ్చుకోవడం లేదు. అత్తయ్యొచ్చింది. కాఫీ, ఫలహారాలు కావాలేమో అడగాలన్న విషయమైనా మట్టిబుర్రకు తడితే కదా!"

ఇదే నాకు నచ్చదు. అర్థం గురించి ఆలోచించకుండానే మనుషులు పడికట్టు పదాలు వాడేస్తారు. బారెడు పొద్దు అంటే ఏమిటి? ఎవరి బార? ఎక్కడ నుంచి ఎక్కడదాకా, దేని మీద కొలిచారు? అంతేకాకుండా ఆంబోతులు రాత్రి తిరుగుతాయా? రికామీగా తిరిగేవాళ్లంతా ఆంబోతులయితే, ఆంబోతుల్లో ఓ డిగ్రీ ఎక్కువ రికామీగా తిరిగేవాటిని సాటి ఆంబోతులు ఏమంటాయి?


ఇవన్నీ మా అత్తయ్యతో నేను చర్చించానా? దాని పర్యవసానం ఏమిటి? అసలు మా అత్తయ్య వచ్చిన కారణం ఏమిటి? ఇవన్నీ తెలుసుకొందామని మీరు ఆతృత పడిపోయి, పేజీలు తిప్పేసి, పేరాల మీదుగా చూపుని దుమికించేసి, కథాంతంలో మలుపు కోసం వెతకబోతే మీరు నిరుత్సాహపడతారు. ఇది ఈనాటి కాప్స్యూల్ కథానిక టైపు కాదు. నా ఆలోచనా ధోరణిని ప్రజలకు అలవర్చాలనే సదుద్దేశ్యానికి, నా అనుభవాన్ని కథారూపంలో పెట్టడం అనేది ఒక సాధనం మాత్రమే.

మా అత్తయ్య సంగతి తెలియని వాళ్లే నేను ఇవన్నీ ఆవిడతో చర్చించడానికి సాహసించాననుకొంటారు. ఆవిడ వాగ్ధాటి నన్ను పక్క మీద నుండి లేవగొట్టి తెమిల్చి పావుగంటలో ఆవిడ ఎదుట కూర్చోబెట్టింది. ఇరవై అయిదు నిమిషాలపాటు సాగిన ఆమె వాక్ప్రవాహంలో వాళ్లమ్మాయి సద్గుణ ప్రశంస, నా దుర్గుణ అభిశంస వంటి తెట్టు తీసేస్తే మిగిలినది మూడు ముక్కల్లో చెప్పవచ్చు–

మా అత్తయ్యకున్న ఎన్టీఆరంతటి  ఆభిజాత్యం, మాలోకం (అసలు పేరు మహర్లోకం) మామయ్య లోకజ్ఞానశూన్యత్వం కారణంగా వాళ్ల అమ్మాయి  నవలామణి పెళ్లికాకుండా ముదిరిపోయింది. కన్యగానే జన్మ ధన్యమై పోతూందనుకొంటుండగా ఈ ముప్ఫై అయిదేళ్ల వయస్సులో చక్రవర్తి అనే అమాయకుడు పెళ్లాడతానంటూ వెంటపడ్డాడు (వీళ్లింటి వెనకింట్లోనే  చేరాడట).

బెండకాయలా ముదిరిపోయిన తనను (మనవాళ్లు బెండకాయకూ, బ్రహ్మచారికీ ముడిపెట్టేరు కానీ, మరి బ్రహ్మచారిణి సంగతో..? చూశారా, తెలుగు భాషను విస్తృతపరచి సుసంపన్నం చేయవలసిన అగత్యాన్ని మీ దృష్టికి తెస్తున్నాను) జాలికొద్దీ పెళ్లాడతానంటున్నాడు కానీ  ప్రేమతో  కాదని అనుమానించి నిరాకరించింది నవలాసారం జీర్ణించుకున్న మా నవలామణి.. కాళ్ల దగ్గర  కొచ్చిన సంబంధాన్ని  (ఆ అమాయక చక్రవర్తి మా అత్తయ్య  కాళ్ల మీద పడ్డాడట) కాదని కాలదన్నుకోడం (మా అత్తయ్య తన్నలేదుటలే) యేమిటని ఈవిడ ఆక్రోశం; నా సహాయం కోసం ఆర్థింపు.

ఇక్కడ పాఠకులు పొరపడే అవకాశం ఉంది. నావంటి మేధావి నుండి సలహా , సంప్రదింపులు మా అత్తయ్య ఆశిస్తోందని అనుకోవడం సహజం. కానీ నిజాన్ని నిక్కచ్చిగా, నిస్వార్థంగా, నిర్ద్వంద్వంగా ఆవిష్కరించవలసిన గురుతర బాధ్యతను గుర్తెరిగిన చరిత్రకారుడిగా నేను ఆ 'బెనిఫిట్ ఆఫ్ డౌట్'ను ఉపయోగించ దలచుకోలేదు. 'సమకాలీనులు మెచ్చరే...' అని తోటకూర వాపోయిందని ఒక కవి రాశాడు. సమీప



బంధువులగురించి  ఆయన కాట్టే తెలియదులాగుంది. మా అత్తయ్యకు నాపై  ఉన్న అభిప్రాయం.. సర్లే, ఎందుకు లెండి. తనకు కావలసినది – అచలపతి ఊరునుండి తిరిగివచ్చాక అతనికీ సమస్య చెప్పి పరిష్కారం తెలుసుకుని అత్తయ్యకు తెలియపరచడం.

రాములవారు చేసిన పొరబాటు నేను చేయదలచుకోలేదు. ఆయన సరైన టైములో జాగ్రత్త పడివుంటే ఈ రోజు రామాలయాల కంటె హనుమంతుడి గుళ్లు ఎక్కువగా ఉండే పరిస్థితి వచ్చి ఉండేదికాదు. అచలపతిని అరికట్టకపోతే ఈ ఆంజనేయుడి విగ్రహం సైజు మరీ పెరిగిపోయేట్టు ఉంది.  రాములవారి విగ్రహంలా నేను ఓ మూల పడివుండాల్సి వచ్చేట్టు ఉంది. అందుకే అచలపతి నడగమనగానే అత్తయ్యకు చెప్పేశా– ఈ విషయం నాకొదిలేయమని!

మా అత్తయ్య భయపడటం నేనెప్పుడూ  చూడలేదు. కానీ నా హామీ వినగానే భయపడింది. కళ్లనీళ్లెట్టుకుని కాళ్లబేరానికి  వచ్చింది, తను  చెప్పినదంతా మరిచిపొమ్మంది, చిన్నప్పుడు తన సెంటు సీసా  నేను పగలగొట్టినదానికి  క్షమిస్తానన్నది.

నేను మొండికేశాను.  మణిని నెల్లాళ్లల్లో ఒకింటి (అది వెనకిల్లే కావచ్చు) దానిని చేసి వదిలి పెడతానని భీషణ ప్రతిజ్ఞ చేసాను. అత్తయ్య ముక్కు చీదుకుంటూ  వాళ్ల ఊరికి తిరిగి వెళ్లిపోయింది. నాకు తెలుసు – కొలంబస్  చేసిన పొరబాటే అత్తయ్యా చేస్తోంది – అనుకోకుండా అమెరికా దొరికినందుకు సంతోషించకుండా ఇండియా దొరకలేదని  చింతించడం తప్పని చాలా శతాబ్దాలకు గాని అతను గుర్తించలేదు.

మనం ఆలస్యంగా పుట్టడం వలన కొన్ని నష్టాలున్నాయి.  న్యూటన్, ఎడిసన్, అయిన్‌స్టీన్ లాటి వాళ్లు ముందుగా పుట్టేసి మనం కనిపెడదామనుకొన్నవన్నీ కనిపెట్టేసి కూచుంటారు.  నా విషయంలో ఫ్రాయిడ్ అలాగే  దగా చేసేసి,  ముందుగా పుట్టేసి నా మనోవిశ్లేషణా విధానానికి 'సైకో ఎనాలిసిస్' అని పేరు పెట్టేసి కూచున్నాడు. ఇక గత్యంతరం లేక నవలామణిని నేను సైకో ఎనాలిసిస్ ప్రకారమే విశ్లేషించవలసి వచ్చింది. నా మనోనేత్రంతో ఆమె మెదడును 'స్కాన్' చేస్తే ఆత్మవిశ్వాసం అనే అర ఖాళీగా కనపడింది.  నా బోటి అందగాడు ఆ బోటి చెంతకు వెళ్లి  ప్రేమను ప్రదర్శిస్తే ఆ అర పొంగిపొర్లేటంతగా నిండుతుంది గదానిపించింది.  కాస్సేపయ్యాక  నా బోటికంటే నేనే  బెటరేమోననిపించింది. రైటో!

వారం తిరక్కుండా  స్నేహితురాలి పెళ్లికి  మణి మా ఊరు  వచ్చినప్పుడు చెప్పేశా– చిన్నప్పట్నించీ తననే మూగగా ప్రేమిస్తున్నానని.

మణి ముఖంలో వెలుగు చూసి నా భుజం నేనే తట్టుకోడానికి చెయ్యి ఎత్తబోతూండగా బాంబు పడింది –

"నా మీద ప్రేమ చేతనేనా ఇన్నాళ్లూ నువ్వు బ్రహ్మచారిగా ఉండిపోయినది బావా!"

"చక్రవర్తిని చేసుకుందామని నిన్ననే అనుకున్నాను" మరొక బాంబు.

"నీ మూగప్రేమకు చలించిపోయేను. చక్రవర్తిని మర్చిపోయి నిన్ను పెళ్లాడాలని ఇప్పుడే నిశ్చయించుకొన్నాను"

ఏమిటీ బాంబుల పరంపర! మేమన్ కుటుంబ ఖాతాదారుల్లో మణి కూడా ఉందా, కొంపపేల్చి!

'ఆ వస్తున్నా' అని ఎవరో పిలుస్తున్నట్టుగా ఇంట్లోంచి పారిపోయి, మణి ఊరెళ్లిపోయిందని రూఢి చేసుకున్నాకనే ఇంటికొచ్చాను.

నా సుఖజీవనానికి కారణభూతమైన బ్రహ్మచర్యపు చిలకను చేజిక్కించుకోడానికి ప్రయత్నిస్తున్న మణిని చూసి, బాలవర్ధిరాజుకి స్వయంగా 'రూట్‌మ్యాప్' గీసిచ్చిన మాయల మరాఠీలా ఫీలయ్యాను. లోకోపకారం ఇంకా కొనసాగించాలంటే పెళ్లిచేసుకోకుండా బ్రతికి ఉండడం అవసరం కాబట్టి ఈ ఉరి తప్పించుకునే ఉపాయం ఆలోచించి, నాలుగు రోజుల్లో అత్తయ్యగారి ఊరు చేరాను.

ఈలోగా అత్తయ్య ఆజ్ఞ మేరకు చక్రవర్తి వచ్చి అచలపతితో సంప్రదింపులు జరపడం, సలహాలు తీసుకోవడం గమనించేను. నేను పట్టించుకోలేదు; అచలపతి తనకు తానుగా ఏదీ చెప్పడు. నా సమస్యకు పరిష్కారం నేనే కనుగొనదలచుకొన్నాను. అన్ని సమస్యలూ తనే పరిష్కరించగలనన్న అహంభావం అచలపతికి కలగకుండా చూడవలసిన గురుతర బాధ్యత నాపై ఉంది కదా!

ఊరు చేరి నా గదిలో పంచె, లాల్చీ వేసుకుని శాలువా కప్పుకోబోతూంటే, మణి నా గదిలోకి వచ్చింది "బావా, ఒక ముఖ్యవిషయం"అంటూ.

"ముందు నా విషయం విను" అంటూ గబగబా చెప్పేశా – "నాకు క్యాన్సర్ వచ్చింది. మిగిలిన ఆయుర్దాయం ఓ అయిదేళ్లేననీ తెలిసినందువల్ల పెళ్లి మానేసి, నాగేశ్వర్రావులా నిన్ను ఆశీర్వదించి పోదామని వచ్చేను" అని. అదే ఊపులో 'కుచ్చిళ్లు బాగా కుదిరేయా, పంచె కట్టే అలవాటు పెద్దగా లేదు కదా' అని కూడా అడిగేను.

మణి ఆశ్చర్యం, విషాదం, దీర్ఘాలోచనం, ఒక నిర్ణయానికి వచ్చేముందు నిట్టూర్చడం లాటివన్నీ అభినయించి చూపించి గంభీరస్వరంతో ఇలా చెప్పింది –

"బావా, నిన్ను చేసుకుంటానని చక్రవర్తికి చెప్పగానే అతను బాధపడి వెళ్లిపోయాడు. రెండు రోజుల్లో తిరిగివచ్చి 'నా సుఖమే తన సుఖమనీ, నాకిష్టమైన వాళ్లని పెళ్లి చేసుకొని సుఖపడ'మని దీవించి, తను ఇంకెవర్నీ ప్రేమించలేని కారణంగా ఆజన్మాంతం నన్నే స్మరిస్తూ చిరకాలం ఉండిపోతానని అన్నాడు. నేను అప్పటికి సరేలేనన్నాను. కానీ రెండు రోజులుగా దీర్ఘంగా ఆలోచించగా అనిపించింది – నేను పెళ్లాడకపోయినా నీ వంటి నిబ్బరం కలవాడు బ్రతకగలడు. కానీ చక్రవర్తి లాటి అమాయకుడు ఏమయిపోతాడు? నీకు క్షమాపణ చెప్పుకొని, అతణ్నే పెళ్లి చేసుకుని అతన్ని కాపాడతానని అతనికి చెప్పాను.

"కానీ బావా, కొద్ది నిమిషాల క్రితం నువ్వు చెప్పింది విన్నాక నా మనస్సు మళ్లీ మార్చుకొన్నాను. నువ్వు ఇదివరకటి కేర్‌ఫ్రీ అనంతానివి కావు. క్యాన్సర్ వ్యాధిపీడితుడివి. ప్రస్తుత పరిస్థితిలో నీకు నా అండ కావాలి. నీ బాధలో నేను పాలుపంచుకొని, నీ ద్వారా పిల్లలు కని, నీవు పోయాక వారిలో నిన్ను చూసుకొంటూ, నీ వితంతువుగా శేషజీవితం గడుపుతూ నీ పేరు కలకాలం నిలిచేటట్లు, నీ వంశాన్ని వృద్ధి చేస్తాను, ఈ క్షణం నుండీ నేను నీ దాననే బావా! ఆ వృద్ధి కార్యక్రమం వెంటనే మొదలుపెడదాం. వ్యవధి పెద్దగా లేదు."

నాలుక కరుచుకొని, ..కొని పుక్కిలినిండా నాలుక ముక్కలే! ఊరుకున్నంత ఉత్తమంలేదని మనవాళ్లూరికే అనలేదు, ఉత్తమంగా అన్నారు. భగత్‌సింగ్ ఉరితాడు తన మెడకి తానే తగిలించుకొన్నప్పుడు కూడా నా అంత లాఘవం ప్రదర్శించి ఉండడు. ఆత్మహత్య ఇంత సులభమని నేనెన్నడూ అనుకోలేదు. ఆత్మహత్య గుర్తుకురాగానే హత్య గుర్తుకొచ్చింది.

నన్ను చేసుకొంటానని కూతురు చెప్పగానే అత్తయ్య నన్ను హత్య చేయడం ఖాయం!

'డామిట్! కథ అడ్డం తిరిగింది' అంటూ గిరీశం రంగస్థల నిష్క్రమణం గావించేడు. 'కథ అడ్డంగా, దిడ్డంగా, ఐమూలగా తిరిగింది' అనుకుంటూ నేను ప్రపంచం నుండే (ప్రపంచమే ఒక రంగస్థలం అని మార్వలెస్సగా అన్నదెవరు! అచలపతిని అడగాలి) నిష్క్రమించాలి కాబోలు! క్లయిమాక్స్‌లో విలన్లతో హీరో పోట్లాడుతూండగా, ఏంచేయాలో తోచని హీరోయిన్లా మూర్ఛ పోదామనుకొన్నాను. పెళ్లి, పిల్లలు, వంశాభివృద్ధి, వంశోద్ధారకుల ఉత్పత్తి వంటి మాటలు నా ప్రయత్నం లేకుండానే నన్ను మూర్ఛపోగొట్టాయి.

కాసేపటికి కళ్లు తెరిచిచూస్తే మణి నా కాళ్లు పిసుకుతూ కనబడింది. నాకు కాళ్ల క్యాన్సరని చెప్పానాని అనుమానం వచ్చింది. కాకపోయినా క్యాన్సర్ రోగికి ఎలా సేవచేయాలో తనకేం తెలుసు! ఏదో ఒకటి చేయాలంటే కాళ్లునొక్కడమే బెస్టనుకొందేమో! 'విశ్వవీణకు తంత్రివై మూర్ఛనలు పొమ్మ'ని శ్రీశ్రీ ఎందుకన్నాడో నాకు అర్థమయింది. వెంటనే మూర్ఛపోయేను మళ్లీ.

ఇంతలో అచలపతి గదిలోకి వచ్చాడు. 'అదిగో, ఆ అడుగుల సడి అతడిదే' అని అనడానికి ఉండదు. అతను ధీరసమీరంలా వస్తాడు; మలయమారుతంలా వెళ్తాడు. అతను గదిలో ఉన్నట్టు మనకు తెలుస్తుంది అంతే! మణి తలయెత్తి అడిగింది – "అచలపతీ, నీకు అన్ని విషయాలు తెలుసంటారు కదా! క్యాన్సర్ వచ్చినవాళ్లకు కాళ్లువత్తడం కాకుండా వేరే చికిత్స ఏం చెయ్యాలి?"

"క్యాన్సరును మన ప్రాచీనులు పుట్టకురుపు అనే పేరుతో వ్యవహరించే వారు మేడమ్. చీమలు పుట్టలు పెట్టినట్టు లోపల పుట్టలుగా, పుట్టలుగా వ్యాధి పెరగడం వల్ల పుట్టకురుపు అనే పదం పుట్టిందని కొందరంటారు. కాదంటారు మరికొందరు. దీన్ని నయం చేసే విధానం గురించి కూడా శాస్త్రకారుల్లో అభిప్రాయ భేదాలున్నాయి. చరకుడు వట్టి శుశ్రూష చాలంటే, శుశృతుడు శస్త్రచికిత్స మంచిదని .." అచలపతి కొనసాగిస్తున్నాడు.

"నేను అరగంటలో వస్తాను. ఈ లోపుల ఇవన్నీ ఆలోచించి ఫైనల్‌గా చెప్పు" అని మణి వెళ్లిపోయింది.

అచలపతి దగ్గేడు – మెత్తగా, ముఖమల్ గుడ్డ మింగేసి దగ్గినట్టు . 'తీరం సురక్షితం' అని చెప్పడానికి.

కళ్లు తెరిచేను. అచలపతికేసి సూటిగా చూసి,"మణి నన్ను పెండ్లాడుదామని అనుకొంటోందని నీకు తెలుసేమో కదా!" అన్నాను.

అచలపతి తల పంకించేడు, "ఈ ఇంట్లో పనివాళ్లదగ్గర విన్నాను సర్. నవలామణి మేడమ్ మిమ్మల్ని చేసుకుంటానని చెప్పబోయేటప్పుడు, మీ అత్తయ్యగారు చేయబోయే కథాకళి చూడటానికి కొంతమంది సెలవులు రద్దు చేసుకొని ఉండిపోయేరు కూడా".

ఇతనితో ఇదే చిక్కు, గొంతులో వ్యంగ్యం, వెటకారం అస్సలు ఉండవు. చేదు నిజాన్ని ఇంత నిక్కచ్చిగా చెప్పకుండా ఉంటే, ఓ చిరునవ్వు మొహాన్న పులుముకొని జోక్ చేస్తున్నాడని సరిపెట్టుకొంటాం. కానీ ఆ ఛాన్సివ్వడే!

"మా అత్తయ్యను ఈ వయస్సులో అంత కష్టపెట్టడం దేనికి? ఆ ప్రోగ్రాం మార్పించే అయిడియా చూడకూడదూ...?"

తప్పదు, అచలపతిని సలహా అడక్క తప్పదు. పనిచేయకుండా వదిలేస్తే అతని బుర్ర తుప్పు పట్టిపోవచ్చు. ఆ ప్రమాదం జరగకుండా చూడవలసిన భారం నాపై కూడా ఉంది. గజనీ మొహమ్మద్ తన సైన్యాన్ని 'ట్రిమ్'గా ఉంచడానికే ఇండియాపై అన్నిసార్లు దండెత్తాడనుకుంటాను.

అచలపతి వివరించేడు – "క్రితంసారి ఇక్కడకు వచ్చినప్పుడు నవలామణి మేడమ్ అలవాట్లు పరిశీలించడం జరిగింది. ఆవిడ అరనిండా బెంగాలీ అనువాద పుస్తకాలే! కన్నీళ్లు, కష్టాలు, త్యాగశీలురు ఉన్న పుస్తకాలూ ఎక్కువగా చదువుతారామె. త్యాగం చేసేవాళ్లంటే ఇష్టపడతారు. స్వయంగా చిన్న, చిన్న త్యాగాలు చేయడానికి ఉత్సాహపడతారు. మీ ప్రేమ గురించి చక్రవర్తికి తెలిపినప్పుడు 'మీ నుండి ఒక నికార్సయిన మనిషిని తయారుచేసే కార్యక్రమంలో తనను తాను అర్పించుకోడానికి సిద్ధపడ్డానని' అన్నారావిడ..."

ఇంత పచ్చి(మిర్చి) నిజం చెప్పడం అవసరమా!? చేదుమందులకు తీపిపూత పూసే హోమియోపతి అచలపతికి తెలియదంటే నేను నమ్మను.


"..అందుకే చక్రవర్తిగారు నన్ను అడిగినప్పుడు ప్రేమమూర్తిగా కాక త్యాగమూర్తిగా నటించమన్నాను. ఆమెకు త్యాగశీలురంటే ఇష్టం కాబట్టి ఆయన వైపు మొగ్గింది. కానీ ఈ లోపుల మీరేదో చెప్పినట్టున్నారు".

"ఈ విషయం తెలియక క్యాన్సర్ ఉందని, వీరత్యాగిగా పోజు కొట్టాను."

"ఆమెకు త్యాగం చేసే అవకాశాన్ని ఇచ్చారు కాబట్టే ఆమె మిమ్మల్ని పెళ్లాడదామనుకొంటున్నారు. ఆమెకు ఇంతకంటే పెద్ద త్యాగాన్ని చేయగలిగే అవకాశం వేరెవరైనా కలిగిస్తే వారినే వరిస్తారనుకొంటాను సర్" అన్నాడు చలపతి.

ఆ సాయంత్రం అమాయక చక్రవర్తి వచ్చి నా కాళ్లు పట్టుకోబోయాడు. 'క్యాన్సర్ చికిత్సా విధానం గురించి మణి దగ్గిర నేర్చుకొన్నావా?' అని అడగబోయేంతలోనే చెప్పేశాడు – అచలపతిని నావెంట తీసుకువచ్చినందుకు నాకు ఆజన్మాంతం ఋణపడి ఉంటాడట. అతని అయిడియాయే తన ప్రాణం నిలిపిందన్నాడు.

వివరాలు చిత్తగించగా తెలిసినది – అచలపతి సలహా మేరకు చక్రవర్తి నవలామణి వద్దకు వెళ్లి, తను సంసార సుఖాన్ని అనుభవించలేదని మొన్ననే డాక్టరు చెప్పాడనీ,




తనను మర్చిపోయి వేరేవాణ్ని పెళ్లాడమనీ చెప్పాడట. నవలామణి ఆలోచనలో పడిపోయిందట – ఇటు చూస్తే  అయిదేళ్ల సంసార సౌఖ్యం, తర్వాత వైధవ్యం, పిల్లాపాపాను పెంచడం – అటుచూస్తే శారీరక సంబంధమే లేకుండా వట్టి 'ప్లేటోనిక్ లవ్'తో  జీవితాంతం ఉండడం. హార్డ్‌కోర్ బెంగాలీ నవలా పాఠకురాలికి  చివరికి అమలినశృంగారమే  నచ్చిందిట.  చక్రవర్తినే  పెండ్లాడతానందట.

మరుసటి రోజు మమ్మల్ని రైలెక్కిస్తూ నవలామణి, "బావా నన్ను అర్థం చేసుకుంటావు కదూ" అంది ముప్ఫై నాలుగోసారి.

'తప్పకుండా, అచలపతంత కాకపోయినా నేనూ అర్థం చేసుకొన్నాను' అన్నాను ముప్ఫై నాలుగోసారి, అచలపతి కేసి అర్థవంతంగా  చూసి నవ్వుతూ. అతను గాంభీర్యం చెడకుండా కొద్దిగానే వంగి అభినందనలు స్వీకరించాడు.